క్లుప్తంగా

అన్నదానం

రౌతులపూడి: మండలంలోని బలరామపురం పాదాలమ్మ, మరిడమ్మ అమ్మవారి ఆలయాల ప్రాంగణంలో శనివారం అన్నదానం నిర్వహించారు. అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సప్తాహం ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 6 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవార్ల అన్న ప్రసాదం స్వీకరించారు. గ్రామ సర్పంచ్ దాసరి తాతాజీ, కాకి సీతారామస్వామి, అచ్చిర్తి సాంబ, మానివెల్లి వెంకటరమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నరసింహయ్య సంతాప సభ

గోకవరం: సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి నంబి నరసింహయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో శనివారం నరసింహయ్య సంతాప సభను నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి కడితి సతీష్, రాష్ట్ర నాయకుడు కొండా దుర్గారావు ఆధ్వర్యంలో నరసింహయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల కోసం నరసింహయ్య చేసిన ఉద్యమాలను కొనియాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడు బాదంపూడి బాబూరావు, రంపచోడవరం డివిజన్ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



తునిలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అంజేస్తున్న ఏలూరి బాలు

తుని: పట్టణంలోని పదో తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 108 మంది, బ్యాంకుకాలనీ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 38 మంది, సీతారాంపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన 93 మంది విద్యార్థులకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాలల హెచ్ఎంలు ప్రభాకర శర్మ, కె.హేమలత, కేఎస్‌వీ సూర్యనారాయణ, శర్మ పాల్గొన్నారు.

నేడు వేటూరి జయంతి వేడుకలు

తుని: స్థానిక చిట్టూరి మెట్రోలో ఆదివారం సినీ గేయ రచయిత వేటూరి సుందర్రామూర్తి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగా రామజోగేశ్వరశర్మ శనివారం తెలిపారు. తునిలో వేటూరి పేరిట సాహితీ పీఠం ఏర్పాటు చేసి 12 ఏళ్లగా సినీ రంగానికి చెందిన ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కవి, గాయకుడు గోరటి వెంకన్నకు వేటూరి పురస్కారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి పాల్గొంటారని వివరించారు.

పొలంబడితో నాణ్యమైన దిగుబడులు



రమణయ్యపేటలో వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏఓ జ్యోతి

ఏలేశ్వరం: రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు వైఎస్సార్ పొలంబడి ఎంతగానో దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి అన్నారు. మండలంలోని రమణయ్యపేట గ్రామంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి ద్వారా మిత్ర, శత్రు పురుగులను గుర్తించవచ్చన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. అనంతరం వీఏఏలు, వీహెచ్ఏలకు పొలంబడిపై శిక్షణ ఇచ్చారు.

నానో యూరియాతో పంటలకు మేలు

జగ్గంపేట: నానో యూరియా వాడకంతో పంటలకు ఎంతో మేలు చేకూరుతుందని ఇఫ్కో రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ టి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాట్రావులపల్లిలో శనివారం ఇఫ్కో నానో యూరియా వాడిన పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 11 వేలకు పైగా ప్రాంతాల్లో పంటలపై నానో యూరియాను పరీక్షించామన్నారు. సాధారణ యూరియాతో పోలిస్తే ఎంతో అద్భుతంగా పని చేస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. రైతులకు నానో యూరియా వాడే విధానాన్ని వివరించారు.

అపరాలకు తెగుళ్ల బెడద

- మినుము, పెసర పంటలపై ఆదిలోనే తెగుళ్ల దాడి
- మందులు పిచికారీ చేస్తున్న రైతులు



కాకరాపల్లిలో మినుము పంటకు ముందు పిచికారీ చేస్తున్న రైతు

కోటనందూరు: తక్కువ పెట్టుబడితో ఆశాజనకమైన దిగుబడులు సాధించే అపరాల పంటలపై ఆదిలోనే తెగుళ్ల దాడి చేస్తున్నాయి. మెట్టలో అపరాల పంటల ద్వారా వచ్చే ఆదాయం కంటే తెగుళ్ల నివారణకు పెట్టే ఖర్చే అధికంగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. డెల్టా ప్రాంతంలో మినుము, పెసర పంటలు ఎకరానికి మూడు నుంచి ఆరు క్వింటాళ్ల దిగువడి వస్తుండగా తెగుళ్లు, ప్రతికూల వాతావరణంతో మెట్టలో కేవలం ఒకటి నుంచి రెండు క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. దీనికి తోడు ఈ ఏడాది ఖరీఫ్ చివరిలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో అపరాల పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పిస్తుందనే ధైర్యంతో రైతులు ముందడుగు వేస్తున్నారు.

5,500 హెక్టార్లలో..

మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సాగునీటి లభ్యత లోటు కారణంగా సార్వాగా వరి, దాళ్వాలో అపరాల పంటను సాగు చేయడం పరిపాటి. రబీలో సాగు చేసే అపరాల పంటలకు తెగుళ్లు, చీడపీడలు, కలుపు బెడద ఎక్కువుగా ఉంటుంది. వాతావరణంలో చోటు చేసుకుంటున్న అసమానతలతో పాటు నిస్సారమైపోతున్న భూమి కారణంగా ఏటా పెట్టుబడి పెరిగిపోతూ ఉంది. అపరాల ధరలు కూడా ఏటా తగ్గిపోతుండడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ పరిధిలోని 5,500 హెక్టార్లలో రైతులు అపరాలు సాగు చేస్తున్నారు. పంట ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉంది. రెండు, నాలుగు ఆకుల దశలో ఉన్న పెసర, మినుము చేలను ఆకుదొలిచు, ఆకుముడత, పచ్చ పురుగులు ఆశిస్తుండడంతో రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు

అపరాల్లో రెండు, నాలుగు ఆకుల దశలో పచ్చపురుగు వ్యాప్తి చెందడం పరిపాటి. ఈ దశలో వేపనూనె లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేస్తే నెల రోజుల వరకూ తెగుళ్ల వ్యాప్తి చెందదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే తెగుళ్లు సోకితే క్లోరిపైరిపాస్ మందును లీటరు నీటికి 2.5 మిల్లీ లీటర్లు లేదా లీటరు నీటికి మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటరు చొప్పున కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను అదుపు చేయవచ్చు. తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉంటే ఎసిఫేట్ లీటరు నీటికి ఒక గ్రాము లేదా డైమెథోయేట్ 1.5 మిల్లీలీటరు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయని మండల ఓఏ చంద్రశేఖర్ తెలిపారు.

మోతాదుకు మించితే ముప్పు



అపరాల సాగులో తెగుళ్ల నివారణకు వ్యవయాధికారుల సూచనల మేరకే రైతులు పురుగు మందులు వాడాలి. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడితే పెట్టుబడి ఖర్చు పెరగడంతో పాటు భూసారం దెబ్బతినే అవకాశం ఉంది. మెరుగైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. భూమిలో నీటి లభ్యత అనుకూలంగా ఉండడంతో పంటను జాగ్రత్తగా కాపాడుకుంటే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చు.

కె.చంద్రశేఖర్, వ్యవసాయాధికారి, కోటనందూరు

ప్రజల సంతోషమే ధ్యేయం



తునిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రజల సంతోషమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 27వ వార్డులో శనివారం సాయంత్రం కౌన్సిలర్ కలిగట్ల ప్రశాంతి ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ- మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి పథకాల ద్వారా ఎంత ప్రయోజనం చేకూరిందో వివరించారు. గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జెడ్ ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తుని రూరల్: ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సమర (బస్సు) యాత్రను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము పిలుపునిచ్చారు. మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం బస్సు యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 20న హిందూపురంలో చేపట్టిన సమరయాత్ర ఫిబ్రవరి 4న శ్రీకాకుళంలో ముగుస్తుందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన 8 ఏళ్లు గడుస్తున్నా ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను నెరవేర్చకుండా బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. హోదా, విభజన హామీలు సాధించేందుకు చేపట్టిన సమరయాత్రకు అన్నివర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఇ.గోకవరం, వేములపాలెం గ్రామాల్లో గడపగడపకూ...



వేములపాలెంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ప్రతిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఇ.గోకవరం, వేములపాలెం గ్రామాల్లో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ అన్నిక సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నిక సత్తిబాబు, చందక నాని, తుట్టా జమిందార్‌లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత మూడున్నరేళ్లలో జరిగిన అభివద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, పార్టీ మండల మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచులు రొంగల నాగేశ్వరరావు, గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీలు మొల్లి వీరబాబు, తటవర్తి రామన్న దొర, ఉమ్మిడి తాతీలు, సొసైటీ చైర్మన్లు కొప్పన గంగారావు, గొంతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గండేపల్లిలో గడప గడపకూ...



గండేపల్లిలో దివ్యాంగుడికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గండేపల్లి: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గండేపల్లిలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, సర్పంచ్ రుత్తల లలిత, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధు తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. గ్రామస్తులు డ్రైన్లు, ఇంటిస్థలం, రేషన్ కార్డు, రహదారులు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు, నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్, సొసైటీ సభ్యుడు కేతిన బాబీ, యల్లమిల్లి ఉప సర్పంచ్ కోన గంగాధర్, ఎంపీడీఓ రామన్, తహసీల్దార్ చిన్నారావు పాల్గొన్నారు.

కన్నులపండువగా శివలింగ ప్రతిష్ఠ మహోత్సవాలు



చేపూరులో స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తుని రూరల్: మండలంలోని చేపూరులో పరివార ప్రయుక్త ఉమారామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం 9.36 గంటలకు బింబ, యంత్ర, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి కుంభాభిషేకం, హోమం, పూర్ణాహుతి, ప్రథమ దర్శనం, శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, నాయకులు సకురు నాగేంద్ర నెహ్రూ, పాకలపాటి రవిరాజు, వంగలపూడి గోవిందుబాబు, సర్పంచ్ కొంద్రు నాగేశ్వరరావు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



క్రిష్ణవరం టోల్‌ప్లాజా వద్ద వినూత్న వేషధారణలతో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కిర్లంపూడి: రోడ్డు ప్రమాదాల నివారణపై శనివారం వినూత్న వేషాధారణలతో వాహనదారులకు అవగాహన కల్పించారు. క్రిష్ణవరం టోల్‌ప్లాజా, జగ్గంపేట జేవీఆర్ సెంటర్, గండేపల్లి, మురారి జాతీయ రహదారి కూడళ్ల వద్ద రోడ్డు సేఫ్టీ సిబ్బంది ఆధ్వర్యంలో యమధర్మరాజు, చిత్రగుప్త వేషాధారణలు ధరించి ప్రతి వాహనదారునికి రోడ్డు భద్రతా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రిష్ణవరం టోల్‌ప్లాజా టీబీఆర్ మేనేజర్ కరీముల్లా మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపినా, వాహనాల్లో పరిమితికి మించి పాసింజర్లను ఎక్కించడం, వేగంగా ప్రయాణించడం, సీటు బెల్ట్ లేకుండా వాహనాలు నడపడం వంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడిన వ్యక్తుల కోసం యమధర్మరాజు,చిత్రగుప్తుడు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్‌డబ్ల్యూసీ సేఫ్టీ మేనేజర్ అశోక్‌రౌల్, సేఫ్టీ ఆఫీసర్ ప్రసంజిత్ బిల్వాస్, ఐఎంటి టీమ్, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

తొండంగి: మండల పరిధిలోని గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, జగనన్న కాలనీలను పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు శనివారం పరిశీలించారు. శృంగవృక్షం, ఎ.కొత్తపల్లి, ఒంటిమామిడి, సీతారాంపురం తదితర ప్రాంతాల్లో జగనన్న కాలనీలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు, నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులకు త్వరితగతిన పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జగదీష్, మండల సర్వేయర్ సీహెచ్ నిరంజన్‌రావు, విలేజ్ సర్వేయర్ లీనాజియాన్, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి

- ఎంపీపీ లగుడు శ్రీనివాసు
- కాకరాపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం



కాకరాపల్లి జగనన్న కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. మండలంలోని కాకరాపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ లంక ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేసి వారి పేరుమీదే సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్య లు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. సర్పంచులు సుర్ల రాంబాబు, జిగటాల వీరబాబు, వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకు లు రుత్తల జోగిరాజు, పంచాయతీ కార్యదర్శి రాజా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



కొత్తపల్లి జగనన్న కాలనీలో అధికారులకు సూచనలిస్తున్న డీఎల్‌డీఓ వీణాదేవి

గోకవరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాజమహేంద్రవరం డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి పి.వీణాదేవి ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఎంపీడీఓ కేవీఎస్ఎన్ మూర్తితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తపల్లి జగనన్న కాలనీలో 335 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చామన్నారు. వీటిలో 18 గృహాలు ఇప్పటికే పూర్తయ్యాయని, పలు దశల్లో 45 ఇళ్లు ఉండగా, ఇంకా 272 ఇళ్లు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఉగాది నాటికి 43 ఇళ్లు పూర్తి చేయాలని, మిగిలిన గృహ నిర్మాణ పనులు త్వరితగతిని పూర్తి చేయాలని అధికారులును ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచుమర్తి కాటమస్వామి, పంచాయతీ కార్యదర్శి చిన్నకుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అలమండ సత్యవతి

ఏలేశ్వరం: పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సత్యవతి మాట్లాడుతూ వచ్చే శివరాత్రికి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు స్నానాలు ఆచరించే ఏలేరునది వద్ద అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పలు వార్డుల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. పట్టణంలోని శివరాత్రికి ఏరాట్లతో పాటు రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ఆమోదం తెలుపుతూ పలు తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించింది. ఇన్‌చార్జ్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, దళే కిషోర్, వై.నాగబాబు, దిలబర్ హుస్సేన్ పాల్గొన్నారు.

రత్నగిరిపై విద్యుత్ వెలుగులు



సర్క్యులర్ మండలం వద్ద దేవతామూర్తుల విగ్రహాలకు విద్యుత్ కాంతులు



విద్యుత్ దీపాల వెలుగులో రత్నగిరి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయ ప్రాంగణం కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలతో శోభాయమానంగా భక్తులకు దర్శనమిస్తోంది. గత వారం నుంచి రత్నగిరిపై విద్యుత్ నామం వెలుగుతున్న విషయం తెలిసిందే. 18 ఏళ్ల క్రితం మరమ్మతులకు గురైన ఈ నామానికి విజయవాడకు చెందిన దాతల సహకారంతో మరమ్మతులు చేయించారు. రామాలయం ప్రాంగణంలోని సర్క్యులర్ మండపం మీద దేవతామూర్తుల విగ్రహాల చుట్టూ ఎల్ఈడీ దీపాలను అమర్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి హెచ్‌సీ జీఎస్ఎన్ మూర్తి శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.గండేపల్లికి చెందిన బదిరెడ్డి శివ గణేష్ (32) శుక్రవారం ఉదయం మురారి శివారులో పొలానికి మందు కొడుతుండగా ఫిట్స్ రావడంతో అక్కడే పడుకున్నాడు. నిద్రలో ఉన్న శివ గణేష్ క్రిమి సంహారక మందును పీల్చడంతో అపస్మార కస్థితికి చేరుకున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

కిర్లంపూడి: ముక్కొల్లులో వేంచేసిన లక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు



ఎస్.అన్నవరంలో స్వామివారి ఊరేగింపు



తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి నైవేద్యం వండుతున్న భక్తులు

ఏలేశ్వరం: రథసప్తమి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి మహిళలు తమ ఇంటి వద్ద సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శివాలయం, సత్యనారాయణస్వామివారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో విష్ణుసహస్ర నామాలు, ఆదిత్య హృదయం, గోవింద నామాలు పఠించారు.

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో పాలు పొంగించి స్వామివారికి నైవేద్యం సిద్ధం చేశారు. అనంతరం సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. సూర్య నమస్కారాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు గిరి ప్రదక్షిణ

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం వెంకటగిరి చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్టు దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), ఈఓ ఆర్వీ చందన తెలిపారు.

గండేపల్లి: రథ సప్తమి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆలయాల్లో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సూర్యప్రభపై స్వామివారి ఊరేగింపు

తుని రూరల్: మండలంలో రథసప్తమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్.అన్నవరంలో పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి రామాలయం వరకు స్వామివారిని సూర్యప్రభపై ఊరేగించారు. రామాలయం వద్ద పిడకల పొయ్యిపై ప్రసాదాన్ని తయారు చేసి స్వామివారికి నివేదించారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు, వేద విద్యార్థులు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శనివారం రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. పండితులు సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక మీద సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి సూర్యభగవానుడికి నూతన వస్త్రాలను సమర్పించారు. సూర్యనమస్కారాలు నిర్వహించిన పండితులకు చైర్మన్, ఈఓలు నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు.

కిర్లంపూడి: స్థానిక విజ్ఞాన భారతీ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న బాలబాలికలకు సూర్యనమస్కారాల పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం గాడి శ్రీనివాసరావు, జనరల్ బాడీ మెంబర్ ముక్కు సుబ్రహ్మణ్యం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి, జగన్నాథపురం, బొద్దవరం గ్రామాల్లో విశ్వమానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యోగథాన్ పేరుతో సూర్యనమస్కారాల పోటీలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లూరి శ్రీనివాసు విజేతలకు బహుమతులు అందజేశారు.

శంఖవరం: కత్తిపూడి శివాలయంలో మహిళలు పిడకల పొయ్యిపై పాయాసం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.